# ఎఱ్ఱగన్నేరుపువ్వు

అప్పుడే వాన కురిసి వెలిసింది. మబ్బులచాటునుంచి తొంగి చూస్తున్నాడు సూర్యుడు. వాన చినుకులకు తడసిన తోటంతా నీరెండలో తళతళలాడుతోంది.

అది చాలా పెద్ద తోట. ఆ తోటలో ఓ మూల ఓ చిన్న గులాబి మొక్క బలహీనంగా గాలికి రెప రెప లాడుతూ ఉంటుంది.

ఆ ప్రక్కనే పొదలా పెరిగిన ఎఱ్ఱ గన్నేరు చెట్టు, తెల్లవారేసరికి చెట్టంతా గుత్తులు గుత్తులుగా నిండి ఉండేవి పూలు.

గులాబీ పూవులు పూసేది: ముచ్చటగా మూడో నాలుగో!

రోజూ, ఆ తోటలోకి ఎందరో వచ్చేవారు, రకరకాల వారు! అందరూ తప్పనిసరిగా ఆ గులాబీ మొక్క దగ్గర ఆగిపోయేవారు. వందిమాగధులవలె ఆ గులాబీ పూల సౌందర్యాన్ని పొగిడేవారు, ఆ సౌందర్యంలో ఒక్క నిమిషం తన్మయులై, ముందుకు సాగిపోతుండేవారు.

రోజూ యీ చోద్యం అంతా ప్రక్కనున్న గన్నేరు పువ్వు కనిపెడుతూ వుండేది. దూరాన్నుంచి వారి మాటలు ఆ పువ్వుకి సగం సగం మాత్రమే వినపడేవి.

కాని ఆ మాటలు వింటూ ఆ పువ్వు అనుకునేది!

'ఎంత అదృష్టం! ఎంతమంది ఈ గులాబీపూల సౌం దర్యానికి ముగ్ధులౌతున్నారో? ఒక్కరూ ఇటువైపు చూడ నైనా చూడరు... తనకూ గులాబీకి ఏమిటి తేడా? తను మాత్రం అంత అందంగానూ లేదూ? అయినా....'

విచారంతో నిట్టూర్చి మళ్లీ ఆశగా అనుకునేది. 'అబ్బా! ఒక్కరోజు ఆ గులాబీపూలతో కలిసిపోగలిగితే! ఒక్కసారి వాటితో బాటు ఆ పొగడ్తలని పంచుకోగలిగితే! అబ్బా! ఒక్కరోజు! !

అనుకోకుండా ఆ పూవు కోరిక ఫలించింది. ఉన్న ట్టుండి, చల్లని గాలి వెల్లువగా వీచింది. ఆ గాలి సందడిలో గన్నేరుచెట్టు గలగలమని కదలిపోయింది.

ఓ గన్నేరు కొమ్మ వంగి గులాబి మొక్కను ముద్దు పెట్టుకొన్నది...గన్నేరుపువ్వు గులాబీఆకులమధ్యన చిక్కు బడిపోయింది.

ఆ పూటకి తనూ ఓ ఎఱ్ఱగులాబీపువ్వై సంతోషిం చింది. ఆకులసందున ఒదిగి ఆనందించింది.

కాస్సేపటికి, ఇద్దరు స్నేహితులు వచ్చారు తోటలోకి. అనుకున్నట్లుగానే ఆ గులాబీ మొక్కదగ్గర ఆగిపోయారు.

వారిలో ఒకతను అన్నాడు, 'ఓహో! ఎంత అంద మైన గులాబీ! !, చక్కని రోజా, చల్లని రోజా'...

ఓ! ఈ పువ్వుమీద మంచి పద్యం రాయ వచ్చోయ్!.

'ఓస్, పద్యమేమిటోయ్!! అసలు దీనిని గురించి చక్కని కథ వ్రాయవచ్చు!' అన్నాడు, కవిత్వం అంటె అంత మోజులేని అతని స్నేహితుడు.

మొదటి అతను అందుకున్నాడు: 'నువ్వేమైనా చెప్పు. పద్యం అందం గద్యానికి రాదోయ్!'

'అదేమిటోయ్! దేని అందం దానికే' అన్నాడు, రెండో అతను తీక్షణంగా. ఎంతకూ ఆ వాదన తెగలేదు. వాదించుకుంటూనే అక్కడనుంచి వెళ్లిపోయారు వారిద్దరు. గన్నేరుపువ్వుకి నిరుత్సాహం కలిగింది. పాపం! వాళ్ళు పువ్వులను గురించి ఏమి చెప్పుకుంటారో విందామని ఆశగా కని పెట్టుకున్నది! వారు పువ్వులకేసి తిరిగిచూడనైనా చూడలేదు!

ఈ సారి, ఓ అబ్బాయి, అమ్మాయి వచ్చారు. ఆ అమ్మాయి అతి సంతోషంతో అన్నది: 'అబ్బ! ఎంత బాగున్నాయో ఈ గులాబీపూలు!'

'నీ ముఖంకంటేనా ?' అన్నా డతను, — ఆప్యాయంగా.

'నిజంగా!' ఆనందంతో ఆమెముఖం వికసించింది.

సిగ్గుతో, సంతోషంతో ఆమె చెక్కిళ్ళు ఎఱ్ఱపడి గులాబీరేకులవలె నిగనిగలాడినవి.

అతనిచేత ఆమాట అనిపించుకోనడం కోసరమే అక్కడికి వచ్చినట్లు ఆమె ముందుకు సాగిపోయింది.

ఆమె వెనకాలే అతనూ వెళ్లాడు.

వారిద్దరూ మళ్ళా గులాబీచెట్టుకేసి చూడలేదు.

గన్నేరు పువ్వుకి పూర్తిగా నిరాశ కలిగింది. గులాబీ పూవులేమి గుసగుసలాడుకుంటున్నాయో విందామని ఆకు లలోనుంచి మెడ ముందుకు వంచింది.

పూలగంప తీసుకొని తోటమాలి వచ్చాడు. ఆకు లతో పాదివి పట్టుకొని పువ్వులు అన్నీ కత్తిరించి బుట్టలో పడేశాడు. గన్నేరు పువ్వుకూడా ఆ సమూహంలో కలిసి పోయింది. తోటమాలి గంప బంగళాలోకి తీసుకువెళ్ళాడు.

ఇంటి ఇల్లాలువచ్చి, బుట్ట అందుకున్నది.

పువ్వులన్నీ మెత్తని తివాసీమీద కుప్పగాపోసి, అనేక రకరకాల పూల సెజ్జలలో రకరకాలుగా, అందంగా, అమ ర్చింది. తరువాత ఒక్కొక్కటీ పట్టుకెళ్ళి, వేరు వేరు గదు లలో బల్లలమీద పెట్టింది.

అందమైన గదిలో, అందమైన బల్లమీద, అందా లొలికే పువ్వులతో కలిసిపోయింది, గన్నేరుపువ్వు.

చలనంలేని వస్తువులను చూస్తూ, నిర్మానుష్యమైన గదిలో అట్లానే వుండిపోయింది చాలా సేపు.

ఒక నిమిషం, రెండు నిమిషాలు, గంట, రెండు గం టలు - కాలం గడచిపోయింది.

...గన్నేరు పువ్వుకు విసుగెత్తి విచారమేసింది.

'ఏమిటి యీ బంధన! ఇక్కడనుంచి విముక్తి లేదా? ఈ జీవితం యిక్కడే ముగిసి పోతుంది కాబోలు!!'

కన్నీరు బొట బొటా రాల్చింది గన్నేరు పువ్వు. హాయిగా పచ్చనితోటలో ఆకులసందున, గుత్తులు గుత్తు లుగా వ్రేలాడే పువ్వుల సరసన, ఆకాశంకేసి చూస్తూ,

గాలికి వూగిపోతూ, జీవితం ఎంత మనోహరంగా వుండేది! ఒక్క రోజైనా గులాబిపువ్వు అనిపించుకోవాలని తనకీ కోరికే లేకపోతే!!

ఆ రాత్రి గడచి తెల్లవారింది. ప్రొద్దున్నే, పనిమనిషి యిల్లంతా సర్దుతోంది. కుర్చీలు, బల్లలు, అన్నీ తుడిచి పూల సజ్జలలోని వాడిన పువ్వులన్నీ కిటికీలోంచి గిరవాటేసింది.

సరిగ్గా గులాబీ మొక్క ఎదురుగానే పడింది, గన్నేరు పువ్వు.

అప్పుడే ఓ ఎఱ్ఱ గులాబీ మొక్క విరిసింది.

మెత్తని పట్టుకుచ్చులలాంటి రేకులతో తళ తళ లాడుతూ, సౌందర్యం ఎఱ్ఱగా ఆకుల దొన్నెలో కుప్పపోసి నట్లుంది.

చల్లగా బంగారపుటుయ్యాలలోలా. అటూ, ఇటూ, అతి సుకమారంగా కదులుతూ, నలు దిక్కుల అందాన్ని వెదజల్లుతోంది గులాబి పువ్వు.

జాలిగా, చూసింది ఆ పువ్వుకేసి గన్నేరుపువ్వు.

కొనవూపిరితో నీరసంగా అన్నది, ఎఱ్ఱ గులాబి పువ్వుతో:

'నీ జీవితం ఏమవుతుందో నాకు తెలుసులే!...'

ఎఱ్ఱ గులాబీకి ఈ మాటలు వినబడ లేదు. మౌనంగా, గంభీరంగా ఆకాశంలోకి చూస్తూ వూరుకుంది, ఆ పువ్వు.

పరిపూర్ణ సౌందర్యం ఆ క్షణంలో, పరిపూర్ణానం దంలో మునిగివుంది, అంతే!